సాక్షి రాజన్న సిరిసిల్ల

ఆదివారం । 15 । సెప్టెంబర్ । 2024



వైభవంగా మహాపూజ

వేములవాడ: గణేశ్ నవరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం రాజన్న ఆలయంలోని శ్రీలక్ష్మీగణపతికి మహాపూజ నిర్వహించారు. ఆదివారం పూర్ణాహుతి అనంతరం నిమజ్జనం చేయనున్నట్లు ఆలయ అధికారులు ప్రకటించారు.



నిండుకుండలా మిడ్‌మానేరు

బోయినపల్లి: మిడ్‌మానేరులో నీటిమట్టం 25.63 టీఎంసీలకు చేరింది. శనివారం అనంతగిరికి 6,400 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో, ప్రాజెక్టులోకి 14,830 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది.

గరిష్టం/కనిష్టం 31.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రేపు సిరిసిల్లలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



డాక్టర్ వసంతరావు, డీఎంహెచ్‌వో

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలో సోమవారం (16వ తేదీన) ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తారని డీఎంహెచ్‌వో డాక్టర్ వసంతరావు శనివారం తెలిపారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశాల మేరకు బీవైనగర్ షాదీఖానా ఫంక్షన్ హాల్‌లో హైదరాబాద్‌లోని అత్యున్నత ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ డిటెక్షన్, మామోగ్రామ్, ఫైన్ నీడిల్ ఆస్పిరేషన్ సైటోలజీ(ఎఫ్ఎన్ఏసీ), సర్వైకల్ బయాప్సీ పరీక్షలు చేసి, వ్యాధి నిర్ధారణ అయినవారికి ఉచితంగా వైద్య సేవలు అందిస్తారని వివరించారు. 25 ఏళ్లు దాటిన మహిళలల్లో తెల్లబట్ట, అధిక రక్తస్రావం, పొత్తికడుపులో నొప్పి, ఛాతీలో నొప్పి, చేతిలో గడ్డలు ఉన్నవారు ఈ వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకోవాలని కోరారు. జిల్లాలోని ప్రైవేట్ డాక్టర్లు, ఆర్ఎంపీ, పీఎంపీలు వారు గుర్తించిన మహిళలు, అనుమానిత మహిళలను శిబిరాలకు వచ్చేలా చూడాలని డీఎంహెచ్‌వో కోరారు. జిల్లాలోని ఐఎంఏ డాక్టర్లు, ఐఎంఏ మహిళా డాక్టర్లు, తెలంగాణ హాస్పిటల్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్(టీహెచ్ఏఎన్ఏ) డాక్టర్లు, సిరిసిల్ల, వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు.. తమ వద్దకు వచ్చే మహిళా పేషెంట్లు సోమవారం నిర్వహించే ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షల శిబిరానికి వచ్చేలా చూడాలన్నారు. జిల్లాలోని మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి కోరారు.


సమతుల్య ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ఎనీమియా పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సిరిసిల్ల: సమతుల్య ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా సంక్షేమ అధికారి పి.లక్ష్మీరాజం అన్నారు. జిల్లాలోని 56 అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ఎనీమియా పరీక్షలు నిర్వహించారు. వేములవాడ పట్టణం, మారుపాక, లింగంపల్లి, హన్మాజీపేట, బొల్లారం, మంగళ్లపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎనీమియా పరీక్షలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా 587 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, తొలిరోజు 56 కేంద్రాల పరిధిలో ఎనీమియా పరీక్షలు జరిగాయన్నారు. రక్తహీనత లోపం ఉన్నవారు ఆకుకూరలు, చిక్కుడు జాతి, మొలకెత్తుతున్న విత్తనాలు, చికెన్, ఫిష్, తృణధాన్యాలైన రాగులు, సజ్జలు జొన్నలు, కొర్రలులాంటి ఆహార పదార్థాలను విరివిగా తీసుకోవాలని సూచించారు. రక్తహీనతతో జబ్బుల బారిన పడి ఆస్పత్రుల వెంట తిరిగి డబ్బులు వృథా చేసుకునే కంటే మంచి ఆహారం తీసుకొని బంగారు భవిష్యత్తును కాపాడుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో కేంద్రాల్లో పీహెచ్‌సీ వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పరీక్షలు చేపట్టినట్లు వివరించారు. ఏసీడీపీవో సుచరిత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అంజమ్మ, డి-హబ్ కోఆర్డినేటర్ రోజా, సఖీ కౌన్సిలర్ సుమలత, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న కడారి రాములు

వేములవాడఅర్బన్: వేములవాడ మూలవాగు పక్కన గల కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులు, రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్కెట్‌లో వేములవాడ చుట్టుపక్కల గ్రామాల రైతులు, వ్యాపారులు కూరగాయలు అమ్ముతుంటారని, మున్సిపల్‌వారు తైబజార్ రుసుము వసూలు చేస్తున్నా మూత్రశాలలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం లేదన్నారు. మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వేణు, శాంతక్క, వ్యాపారులు, రైతులు తదితరులు ఉన్నారు.

బిట్ కాయిన్ హవాలా!

- ముగింపు దశకు దందా
- కేసులు నమోదవుతుండటంతో బిచాణా ఎత్తేసే పనిలో కింగ్‌పిన్
- మల్టీ లెవల్ మార్కెటింగ్ సిస్టమ్ ద్వారా రూ.కోట్లు వసూలు
- హవాలా రూపంలో విదేశాలకు తరలింపు
- వ్యాపారం విలువ కరీంనగర్‌లో రూ. 300 కోట్లు, జగిత్యాలలో 100 కోట్లు
- పలువురు టీచర్లు, పోలీసులు, రియల్ వ్యాపారులు, మాజీ ఎమ్మెల్యేల పెట్టుబడి



సాక్షి పరిశోధన

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

బిట్‌కాయిన్ పేరిట జరుగుతున్న హవాలా దందా ముగింపు దశకు చేరుకుంది. విదేశాల నుంచి తెలుగు రాష్ట్రాల్లో ఆపరేట్ చేస్తున్న నిర్వాహకులు చట్టపరంగా పలు ఇబ్బందుల్లో పడుతున్నారు. ఇటీవల నిర్మల్ జిల్లాలో ఈ రాకెట్ మీద కేసు నమోదైన దరిమిలా.. మిగిలిన ఏజెంట్లు ఆందోళనలో ఉన్నారు. ఒకరు చేరి మరింత మందిని చేర్పించే విధానంలో వచ్చే కమీషన్‌తో నడిచే మల్టీ లెవల్ మార్కెటింగ్(ఎంఎల్ఎం) సిస్టమ్ ద్వారా రూ.కోట్లు వసూలు చేసి, హవాలా రూపంలో విదేశాలకు పంపుతున్నారు. అధిక లాభాల ఆశతో పలువురు టీచర్లు, రెవెన్యూ, పోలీసు అధికారులు, మాజీ ఎమ్మెల్యేలు, రాజకీయ నాయకులు భారీగా పెట్టుబడులు పెట్టారు. ఈ స్కీంలో చక్రం తిప్పుతున్న ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వానికి సమాచారం ఇవ్వకుండా దేశాలు దాటుతున్న వేళ.. ఇది తీవ్ర వివాదంగా మారుతోంది. పథకం మీద నీలినీడలు కమ్ముకున్న నేపథ్యంలో ఇప్పటికే లాభాలు గడించినవారు నింపాదిగానే ఉన్నా.. ఇటీవల రూ.లక్షలు పోసి, చేరినవారు కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నారు.

దుబాయ్, మలేషియా ట్రిప్పులతో ఎర?

బిట్‌కాయిన్ పేరిట రాష్ట్రంలో జరుగుతున్న వ్యాపారం విలువ రూ.1,000 కోట్ల పైమాటే అని అంచనా. నిర్మల్‌లో రూ.50 కోట్లు, జగిత్యాలలో రూ.100 కోట్లు, కరీంనగర్‌లో రూ.300 కోట్ల వరకు ఉంటుందని దళారులు చెబుతున్నారు. రాష్ట్రంలో గతేడాది అసెంబ్లీ ఎన్నికల సందడి మొదలైన తర్వాత రియల్ ఎస్టేట్ రంగం కాస్త నెమ్మదించింది. దీన్ని ఈ దందా చేసేవారు తమకు అనుకూలంగా మలుచుకున్నారు. రూ.5 వేల నుంచి రూ.50 లక్షల వరకు ఎంతైనా ఇందులో పెట్టుబడి పెట్టవచ్చు. ఆన్‌లైన్‌లో వీరికి ఒక యాప్ ఉంటుంది. స్థానిక నిర్వాహకులే వారికి డౌన్‌లోడ్ చేసి, ఐడీ, పాస్‌వర్డ్ ఇస్తారు. ఈ యాప్‌ను ఉపయోగించి, డాలర్లు కొనమని చెబుతారు. రూ.లక్ష పెడితే 1,000 డాలర్లతోపాటు ప్రతీ నెల రూ.12 వేలు ఖాతాలో వేస్తారు. దీనికితోడు వీరు చేర్పించిన ప్రతీ ఖాతాదారు మీద రూ.లక్షకు రూ.6 వేల చొప్పున కమీషన్ వస్తుంది. అతని కింద ఎంత మంది చేరితే అంత కమీషన్ పెరుగుతుంది. అలా కరీంనగర్, పెద్దపల్లి, నిర్మల్, జగిత్యాల జిల్లాల్లో రోజుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు కమీషన్ పొందేవారున్నారంటే అతిశయోక్తి కాదు. 50,000 డాలర్లు చేస్తే వారికి ఫైవ్‌స్టార్ రేటింగ్ ఇస్తారు. దుబాయ్ ట్రిప్పులు ఉంటాయి. ఒకేసారి రూ.కోటి పెట్టుబడి పెడితే వారిని మలేషియా, సింగపూర్, బ్యాంకాక్ విహారయాత్రలకు పంపుతున్నారు. ఖాతాదారుల నుంచి పోగు చేసిన డబ్బును హవాలా రూపంలో దుబాయ్‌కి పంపిస్తున్నారు.

ప్రభుత్వ టీచర్లు, పోలీసులే ఏజెంట్లు..

కరీంనగర్‌లో ఒకప్పుడు ప్రైవేటు స్కూల్ నడిపిన ఓ ప్రముఖుడు స్థానికంగా ఈ వ్యాపారానికి గుండెకాయ. ఇతనికి కరీంనగర్, సుల్తానాబాద్‌లో ప్రధాన అనుచరులున్నారు. జార్ఖండ్‌కు చెందిన సింగ్ వ్యాపారి దుబాయ్ కేంద్రంగా బిట్‌కాయిన్ పేరుతో పేర్లు మార్చి, దాదాపు డజను యాప్‌ల ద్వారా ఈ దందా నడుపుతున్నాడు. తెలుగు రాష్ట్రాలకు విజయవాడకు చెందిన లోకేశ్ బాధ్యుడిగా ఉన్నాడని సమాచారం. ఇతని సూచనలతో కరీంనగర్‌లో ప్రభుత్వ టీచర్లు, రెవెన్యూ అధికారులు, పోలీసులకు గాలం వేశారు. తొలుత వీరికి పార్టీలు ఇచ్చి, విదేశీ టూర్లు ఆశచూపి భారీగా పెట్టుబడులు పెట్టించారు. ఉద్యోగులు తమ సహోద్యోగులు, రియల్ ఎస్టేట్ ఏజెంట్లు, ఇతరులతో పెట్టుబడులు పెట్టించారు. ఈ డబ్బును హవాలా మార్గంలో దుబాయ్‌కి పంపుతుంటారు. చాపకింద నీరులా ఇది రాష్ట్రవ్యాప్తంగా విస్తరించింది. పై ముగ్గురికి రోజుకు రూ.3 లక్షల ఆదాయం కమీషన్ రూపంలో యాప్‌లో పడుతోంది. ఇది సాగినంత సేపు బాగానే ఉంటుంది. యాప్ లో అనుకున్న టార్గెట్ చేరినా.. కొందరు తమ డబ్బును తిరిగి డ్రా చేసుకోలేకపోతున్నారు. తాజాగా పోలీసుల నిఘా పెరగడం, కేసులు నమోదవుతుండటంతో ఈ దందాను నడిపే డజను యాప్‌లలో కొన్నింటిని మెల్లిగా నిలిపివేసి, బిచాణా ఎత్తేసే పనిలో కింగ్‌పిన్ ఉన్నాడని తెలిసింది. దీన్ని ముందుగానే గ్రహించిన కరీంనగర్‌కు చెందిన సీనియర్లు తమ జాగ్రత్తలో తాము ఉన్నారని సమాచారం.

దుబాయ్‌కి హవాలా? అక్కడ నుంచి..?

రాష్ట్రంలో అందులోనూ ఉత్తర తెలంగాణ నుంచి రూ.వందల కోట్లు దుబాయ్‌కి పంపుతున్నారు. ఏజెంట్లు వసూలు చేసిన మొత్తాన్ని హవాలా దుబాయ్‌కి పంపిస్తున్నారు. అయితే, ఈ డబ్బు దుబాయ్‌లోని కింగ్‌పిన్‌కి చేరుతున్నాయి. అయితే, అక్కడ నుంచి ఎవరికి వెళ్తున్నాయి? అన్న విషయం తేల్చేందుకు నిర్మల్ పోలీసులు రంగంలోకి దిగారు. అయితే, ఆ డబ్బులు వ్యక్తిగత ఖాతాల్లోకే వెళ్తున్నాయా? లేదా ఉగ్రవాద సంస్థలకు వెళ్తున్నాయా? అన్న విషయంపై తెలంగాణ పోలీసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై లోతుగా దర్యాప్తు చేసే విషయంలో త్వరలోనే స్పష్టత రానుంది.

కింగ్‌పిన్‌ను పట్టుకుంటాం



నిర్మల్‌లో ఈ తరహా స్కాంలో దాదాపుగా రూ.50 కోట్ల వరకు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. నిందితులను అరెస్టు చేయకుండా ఉండేందుకు పెద్ద ఎత్తున ఒత్తిళ్లు వచ్చాయి. ప్రభుత్వ ఉద్యోగులు చాలామంది కేసులో ఇన్వాల్వ్ అయ్యారు. ముఖ్యంగా ప్రభుత్వ టీచర్లు అందులోనూ ఎస్జీటీలు అమాయకుల నుంచి రూ.కోట్లు వసూలు చేశారు. నిమజ్జనం అనంతరం కేసు స్పీడు పెంచుతాం. దుబాయ్‌లో ఉన్న కింగ్‌పిన్‌ను కచ్చితంగా పట్టుకుంటాం.

– జానకీ షర్మిల, ఐపీఎస్

అందని 'గృహజ్యోతి'



'ఇతను సిరిసిల్లలోని పదోవార్డుకు చెందిన నల్ల నాగరాజు. సెస్ మీటర్ నంబర్ 102100070. సెస్ సిబ్బంది 8 నెలలుగా మీటర్ రీడింగ్ తీయక.. ఒకేసారి తీయడంతో గృహజ్యోతి వర్తించకుండా పోయింది. సెస్ అధికారులు పట్టించుకోకుంటే విద్యుత్ వినియోగదారుల ఫోరంలో కేసు వేయగా.. విచారణలో కొనసాగుతోంది.. ఇలా గృహజ్యోతికి దూరమవుతున్న వారు జిల్లాలో అనేకం ఉన్నారు.



నెల రోజులకు మించి రీడింగ్ నమోదు చేసిన బిల్లులు

- సెస్ సిబ్బంది నిర్లక్ష్యం.. వినియోగదారులకు భారం
- నెల రోజులు దాటిన తర్వాత రీడింగ్
- 200 యూనిట్ల పరిధి దాటుతున్న వైనం
- పథకానికి దూరమవుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) సిబ్బంది మీటర్ల రీడింగ్ నమోదు చేయడంలో నిర్లక్ష్యం కస్టమర్లకు శాపంగా మారుతోంది. నెల రోజులకు కాకుండా 32 నుంచి 40 రోజుల తర్వాత రీడింగ్ తీస్తుండడంతో ప్రభుత్వం విధించిన 200 యూనిట్ల పరిధి దాటి గృహజ్యోతికి దూరమవుతున్నారు. వాస్తవానికి ప్రతీ నెల 30 లేదా 31 రోజులు మించకుండా మీటర్ రీడింగ్ తీయాల్సి ఉంది. కానీ సిబ్బంది నిర్లక్ష్యంతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు.

మొబైల్ బిల్లింగ్‌తో..

సెస్‌లో మీటర్ రీడింగ్ సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వంగా వ్యవహరించడం ఉన్నతాధికారులకు తలనొప్పిగా మారింది. సెస్ పరిధిలోని 13 మండలాల్లో వ్యవసాయ కనెక్షన్లు, గృహాలు, కమర్షియల్ విభాగాల్లో మొత్తం 2,97,481 కనెక్షన్లు ఉన్నాయి. అందులో 1,70,206 గృహ కనెక్షన్లు ఉండగా.. వీటిలో 99,042 గృహజ్యోతికి అర్హత గల కనెక్షన్లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతీ నెల 196 మంది సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మీటర్ రీడింగ్ నమోదు చేస్తున్నారు. గతంలో వినియోగదారు ఇంటికి తాళం వేసి ఉన్న సమయంలో సిబ్బంది ఇష్టానుసారంగా రీడింగ్ నమోదు చేసేవారని ఆరోపణలు ఉండేవి. ప్రస్తుతం సెస్ రీడింగ్ నమోదుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ విధానంలో మొబైల్ బిల్లింగ్ చేపడుతోంది. రోజూ ఒక ఉద్యోగి 300 పైగా మీటర్ల రీడింగ్ తీస్తున్నారు. ఎన్ని రోజులకు రీడింగ్‌కు వచ్చినా 30 రోజుల యావరేజ్‌తో ఆటోమెటిక్‌గా రీడింగ్ నమోదవుతుందని అధికారులు చెబుతున్నారు.

ఇలా అయితే ఎలా ?

- సిరిసిల్లలోని పెద్దబజారుకు చెందిన కుసుమ గణేశ్ మీటరు నంబర్ 1020140633. గత మార్చిలో 35 రోజులకు రీడింగ్ తీస్తే 204 యూనిట్లు రావడంతో గృహజ్యోతికి అనర్హులయ్యారు.
- ఇళ్లకు తాళాలు వేసి ఇతర ఊళ్లకు వెళ్లిన వారి రీడింగ్‌ను 28 నుంచి 30 రోజులకు సుమారుగా రీడింగ్ నమోదు చేయాలి. కానీ 33 రోజులకు నమోదు చేస్తుండడంపై నిలదీయగా.. టిమ్ మిషన్‌లలో సాఫ్ట్‌వేర్ 33 రోజులకోసారి ఫీడ్ అయ్యిందని తప్పించుకుంటున్నారు.

నాణ్యత లేని మీటర్లు ఇస్తుండ్రు



నాణ్యత లేని, ఒక్కో కనెక్షన్ మీటర్‌ను రిపేర్లతో నాలుగైదుసార్లు మార్చుతుండ్రు. ఎన్పీడీసీఎల్ అందించే మీటర్లను అమర్చాలి. అర్హులకు గృహజ్యోతి పథకం వర్తించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రతీ నెల 30 రోజుల్లోపే రీడింగ్ తీయాలి.

– బియ్యంకార్ శ్రీనివాస్, పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు

పొరపాట్లకు ఆస్కారం లేదు



మీటర్ రీడింగ్‌లో పొరపాట్లు వచ్చే అవకాశం లేదు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో రీడింగ్ తీయిస్తున్నాం. ప్రతీ నెల 30 రోజులకు యావరేజ్‌తో బిల్లులు వస్తాయి. వినియోగదారులకు నష్టం ఉండదు. సెస్ పరిధిలో 99,042 కనెక్షన్ల వినియోగదారులు రూ.3.79 కోట్ల విలువైన గృహజ్యోతి పథకాన్ని పొందుతున్నారు.

– ఎల్.శ్రీనివాస్‌రెడ్డి, సెస్ మేనేజింగ్ డైరెక్టర్

రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట– లింగన్నపేట గ్రామాల మధ్య మానేరు వాగుపై నిర్మిస్తున్న హైలెవల్ వంతెన నిర్మాణం వద్ద తాత్కాలిక మట్టి రోడ్డు పనులను సత్వరం పూర్తి చేసి వాహనదారులు ఇబ్బందిపడకుండా చూడాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. శనివారం పనులను పరిశీలించారు. ఆర్అండ్‌బీ అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం ముస్తఫానగర్‌లోని చింతల చెరువును సందర్శించారు. నీటి వృథాను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ వెంట కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, జిల్లా ఉపాధ్యక్షులు కొమిరిశెట్టి తిరుపతి ఉన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

గర్భిణులు, బాలింతలు, పిల్లలు పోషకాహారం తీసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. మండలంలోని లింగన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఎనిమీయా నిర్ధారణ శిక్షణ కేంద్రాన్ని శనివారం సందర్శించారు. రక్త శాతం తక్కువ ఉన్న వారు మందులు, పండ్లు, డ్రైఫ్రూట్ తీసుకోవాలని పేర్కొన్నారు. ల్యాబ్, మందుల గది, డెంగీ నిర్ధారణ పరీక్షలను పరిశీలించారు.

వస్త్ర పరిశ్రమకు అండగా రాష్ట్ర సర్కార్

- కాంగ్రెస్ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం వస్త్ర పరిశ్రమకు పూర్తి అండగా ఉంటుందని ఆ పార్టీ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ నేతన్నలు, రైతులు, నియోజకవర్గ ప్రజల సమస్యలను గాలికొదిలేసి దేశ విదేశాలు తిరుగుతూ ఎంజాయ్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే మహిళలకు నాణ్యమైన చీరలను కాంగ్రెస్ సర్కారు కానుకలుగా ఇచ్చేందుకు రంగం సిద్ధమైందని పేర్కొన్నారు. సిరిసిల్ల నేత కార్మికులకు తమ ప్రభుత్వం వెన్నంటి ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, సీనియర్ నాయకులు గడ్డం నర్సయ్య, వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు సోలార్ వెలుగులు

- కాచాపూర్‌లో పైలెట్ ప్రాజెక్టుగా సౌరశక్తి ప్లాంట్
- పత్తిపాక రిజర్వాయర్, మానేరుపై వంతెన నిర్మిస్తాం
- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- పెద్దపల్లి, ధర్మపురి నియోజకవర్గాల్లో విస్తృత పర్యటన



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

సాక్షి, పెద్దపల్లి/ధర్మారం/పెద్దపల్లిరూరల్: సోలార్ వెలుగులతో జిల్లాకు మహర్దశ పట్టించేలా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వరాలజల్లు కురిపించారు. ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ధర్మారం, పెద్దపల్లి మండలాల్లో శనివారం ఆయన విద్యుత్ సబ్‌స్టేషన్లు, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ధర్మారం, వెల్గటూరు, గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీల నూతన పాలకవర్గాలతో పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. భట్టి మాట్లాడుతూ.. హామీ మేరకు పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించామన్నారు. పాలకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు సైతం త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఎల్లంపల్లి ఎత్తిపోతలకు అవసరమైన విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. పెద్దపల్లిలో బైపాస్ రోడ్డు, ఓదెల మండలంలో మానేరుపై వంతెన నిర్మాణాలు చేపట్టి సకాలంలో పూర్తిచేస్తామన్నారు. ఇందిరా మహిళా శక్తి ద్వారా వచ్చే ఐదేళ్లలో మహిళలకు రూ.లక్ష కోట్ల వడ్డీలేని రుణాలు అందిస్తామని హామీ ఇచ్చారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసే ప్రతిపాదనలు పరిశీలిస్తున్నామని అన్నారు. జూలపల్లి మండలం కాచాపూర్ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, 12 ఎకరాల్లో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ శ్రీహర్షను ఆదేశించారు. పంటలతోపాటు పవర్‌తో కూడా కొంత ఆదాయం వచ్చేలా.. రైతులు ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఇందుకోసం ధర్మారం మండలం నందిమేడారం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేస్తున్నామని ప్రకటించారు. రూ.10వేల కోట్ల పెట్టుబడితో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో రామగుండం థర్మల్ పవర్ ప్లాంట్ స్థాపిస్తామని అన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో 25 ఎకరాల విస్తీర్ణంలో సమీకృత గురుకుల భవన నిర్మాణాన్ని మంజూరు చేస్తామని వెల్లడించారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి – సంక్షేమం రెండు కళ్లు

జిల్లాలో ఆయకట్టు స్థిరీకరణ కోసం పత్తిపాక రిజర్వాయర్‌కు ప్రస్తుత బడ్జెట్‌లో నిధులు కేటాయించామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఓదెల మానేరుపై వంతెన, పెద్దపల్లి, సుల్తానాబాద్‌లో బైపాస్‌ల నిర్మాణానికి సీఎం ఆమోదం తెలిపారని అన్నారు.

పాలిటెక్నిక్ ఏర్పాటు చేయండి

ఎల్లంపల్లి నిర్వాసితుల సమస్య పరిష్కారం కోసం చెగ్యాంలో 126 ఇళ్లు కోల్పోయిన వారికి రూ.18 కోట్లు మంజూరు చేశామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. బొమ్మిరెడ్డిపల్లి వద్ద కొత్తపల్లి కాల్వ పెండింగ్ పనులకు మరో రూ.7 కోట్లు అవసరమని, ఇది పూర్తయితే దాదాపు 10వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందని, తెలిపారు. ధర్మారం మండలంలో ఐటీఐ లేదా పాలిటెక్నిక్ మంజూరు చేయాలని ఆయన మంత్రులకు విజ్ఞప్తి చేశారు.

ఐటీ టవర్ పూర్తిచేయండి

పెద్దపల్లికి బైపాస్ రోడ్డు, ఆర్టీసీ బస్సు డిపో మంజూరు చేయాలని ఎమ్మెల్యే విజయ రమణారావు మంత్రులను కోరారు. పెద్దపల్లి – జమ్మికుంట – పొత్కపల్లి మధ్య రోడ్డు నిర్మిస్తే 14 కి. మీ. దూర భారం తగ్గుతుందన్నారు. సుల్తానాబాద్ కు మంజూరు చేసిన ఐటీ టవర్ నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలని, ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు ప్రతిపాదనలు పరిశీలించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

నిర్ణీత సమయంలో నిమజ్జనం పూర్తిచేయాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



నిర్వాహకులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: పట్టణంలోని బీవైనగర్, జేపీనగర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేశ్ మండపాలను శనివారం రాత్రి ఎస్పీ అఖిల్‌మహాజన్ సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. నిమజ్జనోత్సవానికి పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, భక్తులు పోలీసుల సూచనలు పాటిస్తూ నిర్దేశించిన సమయానికి నిమజ్జనం పూర్తి చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో 4,00, వేములవాడ పట్టణంలో 300, ఆయా గ్రామాల్లో కలిపి మొత్తం దాదాపు 2,200 విగ్రహాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నిమజ్జనం రోజున డీజేలకు అనుమతి లేదని, శోభాయాత్ర సమయంలో ఇతరుల మనోభావాలు దెబ్బతినేల వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ కృష్ణ, మొగిలి, సిబ్బంది పాల్గొన్నారు.

ఫేక్ కాల్స్ నమ్మొద్దు

ప్రభుత్వ అధికారుల పేరిట ఫేక్ కాల్స్ చేస్తూ సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేసేందుకు కొత్త విధానాన్ని ఎంచుకున్నారని వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహజన్ పేర్కొన్నారు. ఎలాంటి సంబంధం లేని నంబర్ నుంచి ఫోన్ చేసి వివరాలు అడిగితే స్పందించవద్దని, అధికారుల పూర్తిస్థాయి వివరాలు తెలుసుకున్నాకే ముందుకెళ్లాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల ప్రమేయంతో ఏదైనా ఆర్థిక లావాదేవీలు జరిగితే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని, తక్షణ సహాయం కోసం డయల్ 100ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

క్లుప్తంగా

రాజన్న సేవలో మీనా రామనాథన్


కోడె మొక్కు చెల్లించుకుంటున్న కమిషన్ మెంబర్ మీనా రామనాథన్

వేములవాడ: వేములవాడ రాజన్నను రాష్ట్ర కన్జూమర్ డిస్ప్యూట్స్ రెడ్రెస్సల్ కమిషన్ మెంబర్ మీనా రామనాథన్ శనివారం దర్శించుకున్నారు. కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆమెకు ప్రత్యేక దర్శన అవకాశం కల్పించారు. అనంతరం వేద పండితులు వేదోక్త ఆశీర్వచనం గావించారు. ఆలయ పర్యవేక్షకుడు నర్సయ్య, ప్రొటోకాల్ పర్యవేక్షకుడు అశోక్ ఉన్నారు.

కుక్కల దాడిలో నలుగురికి తీవ్ర గాయాలు

మంథని: మండలంలోని వెంకటాపూర్, స్వర్ణపల్లి గ్రామాల్లో శనివారం వీధి కుక్కల దాడిలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్వర్ణపల్లిలో ఇంటిముందు ఆడుకుంటున్న చిన్నారులు మానస, వేదాన్ష్, వెంకటాపూర్‌లో గడ్డం మల్లేశ్ అతని కూతురిపై కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో వారు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను స్థానికులు మంథని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కుటుంబసభ్యులు కరీంనగర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

విషజ్వరంతో బాలిక మృతి

గంభీరావుపేట(సిరిసిల్ల): విషజ్వరంతో ఓ బాలిక మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే.. హుస్నాబాద్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మల్లికార్జున్ ఎల్లారెడ్డిపేట మండలంలోని అల్మాస్‌పూర్ హైస్కూల్లో పని చేస్తున్నారు. కుటుంబంతో కలిసి ఎల్లారెడ్డిపేటలోనే ఉంటున్నారు. ఆయన పెద్ద కూతురు హాస్య నక్షత్ర(13)కు తీవ్ర జ్వరం రావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం చనిపోయింది. ఆమె మృతదేహాన్ని కుటుంబసభ్యులు స్వగ్రామం హుస్నాబాద్‌కు తరలించారు.

ఆదర్శ పాఠశాలల్లో బదిలీలు

- టీచర్ల 11 ఏళ్ల నిరీక్షణకు తెర
- ఉమ్మడి జిల్లాలో దాదాపు 800 మందికి స్థానచలనం

కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 47 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో పని చేస్తున్న దాదాపు 800 మంది టీచర్ల చిరకాల వాంఛ నెరవేరింది. ఉద్యోగాల్లో చేరిన 11 ఏళ్ల తర్వాత తొలిసారి భారీగా బదిలీలు జరిగాయి. న్యాయపరమైన అవాంతరాలు తొలగిపోవడం, హైకోర్టు బదిలీలకు ఓకే చెప్పడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో శనివారం ఒకేరోజు టీచర్లందరూ తాము పని చేస్తున్న పాఠశాలల నుంచి రిలీవ్ అయ్యారు. ఆ వెంటనే తమకు కేటాయించిన స్కూళ్లలో చేరిపోయారు.

రెండు విడతల్లో నియామకం..

మోడల్ స్కూళ్లలోని ఉపాధ్యాయులు 2013, 2014 సంవత్సరాల్లో రెండు విడతల్లో నియమితులయ్యారు. మూడేళ్లుగా తమను బదిలీలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో విద్యాశాఖ గతేడాది జూలైలో బదిలీల షెడ్యూల్ విడుదల చేసింది. టీచర్లందరూ వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకున్నారు. కానీ, సర్వీస్ పాయింట్ల కేటాయింపుపై కొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. న్యాయస్థానం స్టే విధించడంతో బదిలీల ప్రక్రియ ఆగిపోయింది.


రుక్మాపూర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న నిమ్మల సుధాకర్


బెజ్జంకి ఆదర్శ పాఠశాల

మెరిట్ ప్రకారం..

2013, 2014లలో టీచర్లు ఉద్యోగాల్లో చేరినా మెరిట్ ప్రకారం సీనియారిటీ జాబితా తయారు చేసి, బదిలీలు చేపట్టవచ్చని హైకోర్టు తాజాగా తీర్పునిచ్చింది. ఉద్యోగాల్లో చేరిన తేదీ ఆధారంగా ఎన్‌టైటిల్‌మెంట్ పాయింట్లు కేటాయించాలని చెప్పింది. దీనివల్ల అడ్డంకులు తొలగిపోయాయి. పాత జోన్ల(5, 6) ప్రకారమే బదిలీలు పూర్తయ్యాయి. ప్రిన్సిపాళ్లను రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకొని, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్(పీజీటీ), ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (టీజీటీ)ను జోన్ యూనిట్‌గా తీసుకొని, స్థానచలనం కల్పించారు. ఏళ్లుగా ఎదురుచూస్తున్నామని, తమ కల ఇప్పుడు తీరిందని టీచర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి గణనాథుని నిమజ్జనోత్సవం



తిమ్మాపూర్(మానకొండూరు): కరీంనగర్ 'సాక్షి' యూనిట్ ఆఫీస్‌లో శనివారం సాయంత్రం వినాయక నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు చేపట్టారు. శోభాయాత్రలో యూనిట్ మేనేజర్ వైద శ్రీనివాస్, బ్యూరో ఇన్‌చార్జి అనిల్‌కుమార్, కరీంనగర్, ఆదిలాబాద్ ఎడిషన్ ఇన్‌చార్జులు ముజఫర్, గుర్రాల మహేశ్, డెస్క్ ఇన్‌చార్జులు బొగ్గుల సంతోష్‌కుమార్, కనకేశ్వర్, డి. రాజశేఖర్, పోలు సంపత్, ఏడీవీటీ డిప్యూటీ మేనేజర్ జి.వేణుగోపాల్, అసిస్టెంట్ మేనేజర్లు గంగుల మహేందర్‌రెడ్డి, ముస్కుల విద్యాసాగర్‌రెడ్డి, డీటీపీవో కోడూరు దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు ఇవ్వండి

- అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం ఉదయం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్స్‌ను కలిశారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పలు విద్యాసంస్థల యజమానులు, సేవా సంస్థల నిర్వాహకులు, యువజన సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి..

హుజూరాబాద్: ప్రజాసేవ కోసమే తాను రాజకీయాల్లోకి వస్తున్నానని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి తెలిపారు. శనివారం హుజూరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓటర్ల ఎన్‌రోల్ కార్యక్రమం ప్రారంభించామని, డిగ్రీ పూర్తి చేసి, మూడేళ్లు గడిచిన పట్టభద్రులందరూ ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సుమారు 20 లక్షల మంది పట్టభద్రుల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన జాబ్ క్యాలెండర్‌ను చూసి ఆకర్షితుడినై, కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నానని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ డీఏ చెల్లించేలా చూస్తానని, ప్రైవేట్ ఉద్యోగులకు 12 నెలల జీతం ఇచ్చేలా యాజమాన్యాలతో చర్చిస్తానన్నారు. ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు ఇచ్చేలా ముఖ్యమంత్రితో మాట్లాడతానని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల భూములు కబ్జాకు గురయ్యాయని, తనను గెలిపిస్తే హైడ్రా తరహాలో చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.


వాకర్స్‌తో మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

బూడిద వ్యాన్ బోల్తా


రోడ్డు పక్కన బోల్తా పడిన వ్యాన్

చందుర్తి(వేములవాడ): బూడిద లోడ్‌తో వెళ్తున్న ఓ వ్యాన్ బోల్తా పడింది. స్థానికుల కథనం ప్రకారం.. చందుర్తి మండలంలోని బండపల్లి నుంచి శనివారం సాయంత్రం ఓ వ్యాన్ బూడిద లోడ్‌తో వెళ్తోంది. ఆ సమయంలో ఎదురుగా ట్రాక్టర్ రావడంతో డ్రైవర్ వ్యాన్‌ను రోడ్డు కిందకు దించాడు. దీంతో అది బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికీ ఏం కాలేదని గ్రామస్తులు తెలిపారు. వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజీపేట నుంచి చందుర్తి మండలంలోని ఎన్గల్, బండపల్లి మీదుగా కోనరావుపేట మండలంలోని బావుసాయిపేట వరకు తారు రోడ్డు వేశారన్నారు. రెండేళ్లు గడుస్తున్నా దారికిరువైపులా మట్టి పోయడం లేదని పేర్కొన్నారు. భారీ వాహనాలు వచ్చి, రోడ్డు దిగితే బోల్తా పడుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి, మట్టి పోయించాలని కోరుతున్నారు.

సమ్మిరెడ్డి మృతితో జమ్మికుంటలో విషాదం

జమ్మికుంట(హుజూరాబాద్): కాంగ్రెస్ నేత, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి(59) శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుండెపోటుతో మృతి చెందారు. ఈ సంఘటన జమ్మికుంటలో విషాదం నింపింది. ఆయనకు భార్య ఉషారమ, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.

స్వస్థలం జయశంకర్ భూపాలపల్లి జిల్లా..

సమ్మిరెడ్డి స్వస్థలం జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని వెన్నంపల్లి. ఆయన జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకున్నారు. ఇక్కడే వామపక్ష రాజకీయాల వైపు ఆకర్షితుడయ్యారు. పీపుల్స్‌వార్ గ్రూప్ దళ నాయకుడు మాసాని రవీందర్ ప్రభావంతో విద్యార్థి ఉద్యమాల్లో క్రియాశీలకంగా పని చేశారు. కొన్ని రోజులు దళ సభ్యుడిగా పని చేసి, బయటకు వచ్చాడు. ఆ తర్వాత ఎన్‌ఎస్‌యూఐ నాయకుడిగా రాజకీయ రంగప్రవేశం చేసి, అంచెలంచెలుగా ఎదిగారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డికి సన్నిహితుడిగా ఉండేవారు. రెండు పర్యాయాలు జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పని చేశారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి..

తుమ్మేటి సమ్మిరెడ్డి మృతి విషయం తెలుసుకున్న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ పొన్నం ప్రభాకర్ గౌడ్ శనివారం జమ్మికుంటలోని ఆయన నివాసానికి చేరుకున్నారు. సమ్మిరెడ్డి మృతదేహానికి నివాళి అర్పించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న మంత్రి ప్రభాకర్ గౌడ్, ఎమ్మెల్యే సత్యనారాయణ

ప్రముఖుల నివాళి..

కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఆరెపల్లి మోహన్, వొడితల ప్రణవ్, దేశిని కోటి, పత్తి కృష్ణారెడ్డి, పాడి ఉదయనందన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు మాజీ ఎంపీ వినోద్‌కుమార్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, నారదాసు లక్ష్మణ్‌రావు, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, ఓయూ విద్యార్థి సంఘం నేత హరిబాబు తదితరులు నివాళి అర్పించారు.

ఇందిరమ్మకాలనీ గురుకుల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని ఇందిరమ్మకాలనీ తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ గుడి పద్మను సస్పెండ్ చేస్తూ గురుకులాల రాష్ట్ర కార్యదర్శి కె.సీతాలక్ష్మి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల పీఈటీ జ్యోత్స్న ఇటీవల బాలికలను వేధించడంతో వారు ఆందోళన చేపట్టారు. దీంతో పీఈటీని అదేరోజు సస్పెండ్ చేయగా.. విచారణ అనంతరం విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకున్నారు.


పద్మ

చిన్నారి బ్లెస్సీకి సేవా పురస్కారం


బ్లెస్సీ

కోనరావుపేట(వేములవాడ): ప్రకృతికి ప్రాణం పోసే బాటలో తండ్రి నడిస్తే కూతురు సైతం అదే బాటలో సాగుతోంది. మండలంలోని సుద్దాలకు చెందిన పర్యావరణ ప్రేమికురాలు బ్లెస్సీకి ఏకే తెలుగు మీడియా ముంబై (మహారాష్ట్ర) వారు పుడమికి పచ్చనిహారం ఉత్తమ సేవా పురస్కారం, ప్రశంసాపత్రం అందజేశా రు. అలాగే 2022లో బ్లెస్సీకి రాష్ట్ర ప్రభుత్వం చార్మినార్ ప్రతిమతో పాటు అవార్డు, నగదు అందజేసింది. ఈసందర్భంగా బ్లెస్సీ తల్లిదండ్రులు ప్రకృతి ప్రకాష్, మమత ఏకే తెలుగు మీడియా ముంబై వారికి కృతజ్ఞతలు తెలిపారు.

రక్తదాన శిబిరం విజయవంతం


శిబిరంలో సీఐ కృష్ణ, కౌన్సిలర్ రాజు, రెడ్‌క్రాస్ సభ్యులు

సిరిసిల్లటౌన్: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబికానగర్ మహారాజు వినాయక మంటపంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. టౌన్ సీఐ కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని నిర్వాహకులను అభినందించారు. 30 మంది యువకులు రక్తదానం చేయగా, బ్లడ్‌బ్యాంకు సిబ్బంది శాంపిళ్లను సేకరించారు. రక్తదాతలకు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అర్బన్‌బ్యాంకు చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, స్థానిక కౌన్సిలర్ కల్లూరి రాజు, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ గుడ్ల రవి, వైస్ చైర్మన్ ప్రయాకరావు వేణు, కోశాధికారి బుడిమె శివప్రసాద్, కార్యదర్శి టి.శివప్రసాద్, గుడ్ల సునీల్‌కుమార్, ఐ.భాస్కర్, మహారాజ్ మంటప సభ్యులు పాల్గొన్నారు.

అ'ద్వితీయ'మైన ఉత్సవాలు


పూజలందుకుంటున్న సిరిసిల్ల వర్తకసంఘం వినాయకుడు

సిరిసిల్లటౌన్: కార్మికక్షేత్రంలో వెలసిన రెండో గణపతిగా సిరిసిల్ల వర్తక సంఘం వినాయకుడికి పెట్టింది పేరు. 1948లో వర్తకసంఘాన్ని ఏర్పాటు చేసినట్లు పెద్దలు చెబుతున్నారు. స్థానిక పెద్దబజారు హన్మాన్ ఆలయంలో రేకుల షెడ్డులో ఏర్పాటు చేసిన ఈసంఘం ఇంతింతై వటుడింతై అన్నట్లుగా అభివృద్ధి చెందింది. ఏటా వినాయక నిమజ్జనానికి రెండ్రోజులు ముందుగా సిరిసిల్లలో రోషన్లు (భారీ సెట్టింగులు, ప్రత్యేక అలంకారాలు చేయడం)ఆనవాయితి. ఈక్రమంలోనే వర్తకసంఘం వారు ఆది దేవునికి ఇష్టమైన పిండి పదార్థాలను వందల సంఖ్యలో చేస్తూ నైవేద్యం పెట్టడం సంఘం ప్రత్యేకత. తొలితరంలో గాండ్ల వీరయ్య నేతృత్వంలో పుల్లూరి బుచ్చారాం, ఎరుకల నర్సయ్య, కొడిమ్యాల తిరుపతి, పుల్లూరి లక్ష్మీనారాయణ, కాచం చిన్నభూమయ్య, చేపూరి విఠల్ తదితరులు కలిసి ఈసంఘాన్ని స్థాపించి వినాయక ఉత్సవాలు జరుపుతూ వస్తున్నారు. ఈఏడాదితో 76వ వార్షికోత్సవం జరుపుతున్న వర్తకసంఘానికి ప్రస్తుతం పుల్లూరి వేణు అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

'సిమ్స్'లో మహిళా ఉద్యోగిపై వేధింపులు?

- పోలీసుల అదుపులో నిందితుడు!

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్)లో పని చేస్తున్న మహిళా ఉద్యోగులపై వేధింపుల ఘటనలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న ఓ మహిళా ఉద్యోగిపై, తాత్కాలిక ఉద్యోగి వేధింపులకు పాల్పడిన సంఘటన మరవకముందే, తాజాగా మరో ఘటన వెలుగులోకి వచ్చింది. ఔట్‌సోర్సింగ్ మహిళా ఉద్యోగిపై, ఓ పర్యవేక్షకుడు వేధింపులకు పాల్పడినట్లు షీటీంకు ఫిర్యాదు రావడంతో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకొని, విచారణ జరుపుతున్నట్లు సమాచారం. దీనిపై మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నరేందర్‌ను శనివారం వివరణ కోరగా.. తమ దృష్టికి రాలేదని తెలిపారు.

కారు పార్కింగ్ విషయంలో గొడవ

- అడ్వకేట్‌పై కేసు

సిరిసిల్ల క్రైం: సిరిసిల్ల పట్టణంలోని ఓ షాపు ఎదుట కారు పార్కింగ్ విషయంలో గొడవతో ఓ అడ్వకేట్‌పై కేసు నమోదైంది. టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన కైలాష్ అనే అడ్వకేట్ శనివారం తన కారును పట్టణంలోని మిట్టపల్లి శ్రీనివాస్–రాజేశ్వరి దుస్తుల షాపు ఎదుట నిలిపారు. కారు తీయాలని చెప్పడంతో గొడవ జరిగింది. కైలాష్ తనను దుర్భాషలాడాడని, చంపేస్తానని బెదిరించాడని రాజేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఆయనపై కేసు నమోదు చేసినట్లు వారు పేర్కొన్నారు.

వేములవాడలో రైస్‌మిల్లు సీజ్


మాట్లాడుతున్న జిల్లా పౌరసరఫరాల అధికారి వసంతలక్ష్మి

వేములవాడరూరల్: వేములవాడ పట్టణంలోని శాత్రాజుపల్లి రోడ్డులో గల మహాలక్ష్మి రైస్‌మిల్లును సీజ్ చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి వసంతలక్ష్మి తెలిపారు. ఆ మిల్లులో శుక్రవారం రాత్రి రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నట్లు వచ్చిన వీడియో ఆధారంగా శనివారం తనిఖీలు నిర్వహించామన్నారు. బియ్యం శాంపిల్స్ సేకరించి, 6ఏ కేసు నమోదు చేసి, మిల్లును సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలను జాయింట్ కలెక్టర్‌కు అందజేసి, తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. వేములవాడ పట్టణంతోపాటు ఇతర ప్రాంతాల్లోని మిల్లుల్లోనూ రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ మిల్లును సీజ్ చేయడంతో మిగతా మిల్లుల యజమానులు తాళాలు వేసుకొని, పరారైనట్లు సమాచారం.

మహిళా కండక్టర్‌పై లైంగిక వేధింపులు

- డ్రైవర్‌పై అట్రాసిటీ కేసు

జగిత్యాల క్రైం: ఆర్టీసీకి చెందిన ఓ మహిళా కండక్టర్‌ను లైంగిక వేధిస్తున్న డ్రైవర్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు జగిత్యాల పట్టణ ఎస్సై మన్మదరావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జగిత్యాల డిపో మహిళా కండక్టర్‌ను డ్రైవర్ గడ్డం రమేశ్ లైంగికంగా వేధిస్తూ కులం పేరుతో దూషిస్తున్నాడు. బాధితురాలు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. డ్రైవర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రాఘవాచార్యులు జీవితం స్ఫూర్తిదాయకం


పుస్తకం ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు, కవులు

- సాహితీవేత్త గంద్ర లక్ష్మణరావు

కరీంనగర్ కల్చరల్: సంస్కృతాంధ్ర పండితుడు గోవర్ధన రాఘవాచార్యులు జీవితం స్ఫూర్తిదాయకమని ప్రముఖ సాహితీవేత్త గంద్ర లక్ష్మణరావు అన్నారు. శనివారం కరీంనగర్‌లోని సిద్దార్థ పాఠశాలలో ఆయన కుటుంబసభ్యుల సంపాదకీయంలో వచ్చిన రాఘవీయ స్మృతి సంచికను ఆవిష్కరించి, మాట్లాడారు. రాఘవాచార్యులు జీవిత కాల పాండిత్య సేవలను ఈ పుస్తకం ద్వారా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. టీచర్ కృష్ణమాచార్యులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాఘవాచార్యులు కుటుంబసభ్యులు వెంకటశేషాచార్యులు, రాజా రామ్మోహన్, సిద్దార్థ విద్యాసంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి, పారమిత విద్యాసంస్థల చైర్మన్ ఇనుగంటి ప్రసాద్‌రావు, సాహితీ గౌతమి అధ్యక్షుడు నంది శ్రీనివాస్, జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు గాజుల రవీందర్, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు కొత్త అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా భూ రిజిస్ట్రేషన్, బెదిరింపులు

- ఒకరి అరెస్టు
- పరారీలో మరో ముగ్గురు

వేములవాడ: ఓ మహిళ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని, అడిగితే చంపుతామని బెదిరించిన వ్యక్తిని అరెస్టు చేశామని వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వేములవాడ సాయినగర్‌కు చెందిన మెండ శంకరవ్వకు డబ్బులు అవసరం ఉండటంతో చెక్కపల్లి రోడ్‌లో తనకున్న 60 గుంటల వ్యవసాయ భూమిలో నుంచి ఒక గుంటను పోగుల శ్రీనివాస్‌కు విక్రయించింది. కానీ, అతను మొత్తం భూమిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకొని, ముత్యాల రమేశ్‌కు విక్రయించాడు. దీంతో శంకరవ్వ కోర్టులో కేసు వేసింది. ఈ భూ వివాదం గురించి తెలుసుకున్న స్థానికుడు కడారి తిరుపతి శంకరవ్వ వద్దకు వచ్చి, చంపుతానని బెదిరించాడు. ఆమె చేత బలవంతంగా సంతకాలు చేయించుకొని, 60 గుంటల భూమిని తన తమ్ముడు మహేందర్ పేరిట డబుల్ రిజిస్ట్రేషన్ చేయించాడు. తర్వాత అందులో ప్లాట్లు వేసి, ఇతరులకు విక్రయిస్తుండగా శంకరవ్వ వెళ్లి, నిలదీసింది. దీనికి వారు.. నీకు భూమి ఎక్కడిదని ఆమెను బెదిరించి, ఇక్కడికి వస్తే చంపుతామన్నారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు పోగుల శ్రీనివాస్, ముత్యాల రమేశ్, కడారి తిరుపతి, కడారి మహేందర్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. తిరుపతిని శనివారం అరెస్ట్ చేశామని, మిగతా ముగ్గురు పరారీలో ఉన్నారని, త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు రీడిజైన్ చేయాలి


మున్సిపల్ కమిషనర్ సంపత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న వివిధ పార్టీల నాయకులు

వేములవాడ: రాజన్న ఆలయం పక్కన ఉన్న అంబేద్కర్ విగ్రహ చౌరస్తా సుందరీకరణ పనులను గత నెల ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ప్రారంభించారు. కాగా సుందరీకరణ విషయంలో మున్సిపల్‌శాఖ రూపొందించిన డిజైన్‌లో అంబేద్కర్ విగ్రహం ఒకవైపు, గార్డెన్ మరోవైపు ఉండడం వల్ల విగ్రహాన్ని అవమానపరిచేలా ఉంటుందని, రీడిజైన్ చేయాలని కోరుతూ వివిధ రాజకీయాల పార్టీల, బహుజన సంఘాల నాయకులు శనివారం మున్సిపల్ కమిషనర్ సంపత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అంతకు ముందు వీరంతా అంబేద్కర్ విగ్రహాన్ని సెంటర్ పాయింట్‌లో ఏర్పాటు చేసేందుకు స్థల పరిశీలన చేశారు. సుందరీకరణలో భాగంగా అంబేద్కర్ విగ్రహం మధ్యలో వచ్చేలా డిజైన్ చేయాలని వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, కౌన్సిలర్లు రేగుల సంతోష్‌బాబు, నిమ్మశెట్టి విజయ్, అంబేద్కర్ సంఘం డివిజన్ అధ్యక్షుడు దుమ్మ ఆనంద్, ఎమ్మార్పీఎస్ నాయకుడు గుండా థామస్, బహుజన సేన జిల్లా అధ్యక్షుడు జింక శ్రీధర్, భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్, అంబేద్కర్ మాదిగ సంఘం శాత్రాజుపల్లి అధ్యక్షుడు గుడిసె మనోజ్‌కుమార్, మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చంటి మహేశ్, వివిధ ప్రజా సంఘాల నాయకులు ప్రతాప్, రమేశ్, తిరుపతి, బుచ్చి రాములు తదితరులు పాల్గొన్నారు.